ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- ఘనంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- పార్టీ జెండా ఆవిష్కరించి సంబరాలు చేసుకున్న నాయకులు, కార్యకర్తలు



ఎమ్మిగనూరు పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు రుద్రగౌడ్, కామర్తి నాగేషప్ప

ఎమ్మిగనూరుటౌన్: ప్రజల సంక్షేమం కోసమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వీరశైవలింగాయత్ అధ్యక్షుడు రుద్రగౌడ్ అన్నారు. ఐదేళ్లలో అనేక సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు చేరువైన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన పార్టీ నేడు రాష్ట్రంలోని అని వర్గాల ప్రజల్లో గుండెల్లో నిలిచిపోయిందన్నారు. బుధవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్, రాష్ట్ర బీసీ విభాగం సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, సంయుక్త కార్యదర్శి సునీల్‌కుమార్, యూకే రాజశేఖర్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ తదితరులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అంతకుమునుపు పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్ మరణాంతరం ఆయన తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నాడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజల పక్షాన నిలిచిందన్నారు. ప్రతి పక్షనేతగా పేదలు, రైతుల కోసం ఎన్నోపోరాటాలు చేశారన్నారు. ముఖ్యమంత్రిగా వారి సంక్షేమానికి ఎంతో కృషిచేశారని చెప్పారు.

ఐదేళ్లలో జనరంజక పాలన

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ఐదేళ్ల జనరంజక పాలన కొనసాగించారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అసత్య, అమలుకు వీలుకాని హమీలతో ప్రజలను నమ్మించి గద్దెనెక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేందుకు పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రజలకు మరింత చేరువకాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ మాచాని వెంకటేష్,నందవరం మండల పార్టీ అధ్యక్షుడు శివప్పగౌడ్, పార్టీ నాయకులు సోమేష్,రాజారత్నం,బజారి, కోటకొండ నరసింహులు,పేట శ్రీనివాసరెడ్డి, డిష్ కేశవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, దేవరాజ్, పాలశ్రీనివాసరెడ్డి, లత, మాబ్బాష, ఖిబ్రియ, రుద్రాక్షాల బజారి, లియాఖత్, పార్టీ పట్టణ, గ్రామ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సేవకోసమే పార్టీ ఆవిర్భావం

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్, ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్, బి.ఏ.కార్తిక్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా గ్రామ ప్రధాన కూడలిలోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవా చేయాలన్న ఉద్దేశంతోనే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ స్థాపించారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉమాకాంతరెడ్డి, నాయకులు మూదకరెడ్డి, శివప్పస్వామి, లక్ష్మీకాంత్, నగేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



బదినేహాల్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గోనెగండ్లలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోనెగండ్ల : మండలంలోని గోనెగండ్ల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దమరివీడు, గంజిహళ్లి, కులుమాల,పెద్దనేలటూర్, తిప్పనూరు, బైలుప్పల, పిల్లిగుండ్ల, ఎర్రబాడు తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం గోనెగండ్లలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బందెనవాజ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల వారికీ ఐదు సంవత్సరాల కాలంలో సంక్షేమ పథకాలను అందించి ప్రజలతో మంచి ముఖ్యమంత్రి అనిపించుకున్న ఏకైక వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలోకి తొక్కిందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు మురళీ నాయుడు, ఇమ్రాన్, గోవింద్, మాబువలి, ఉస్మాన్, పద్మనాభం, నదిముల్లా, ముల్లా రఫీ, చికెన్ రాజా, సత్తార్, హుసేన్ వలి, నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ



క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: టీబీ రోగులకు ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు డాక్టర్ షేకున్‌బాను తెలిపారు. ఉపాధ్యాయులు నిరంజన్‌కుమార్, ఫయాజుద్దీన్ పట్టణంలో 20 మంది పేద క్షయవ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని వారికి రూ.1000 విలువ చేసే పోషకాహారాన్ని అందించడం జరిగిందన్నారు. ఇలా ఆరు నెలలపాటు పోషకాహార కిట్లను అందిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి

ఎమ్మిగనూరురూరల్: పని ఒత్తిడి, పనిభారం తగ్గించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీవో బంగారమ్మ, ఈఓఆర్డీ విజయలక్ష్మిలకు వినతి పత్రం అందజేశారు. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు శరణబసవ, ఉపాధ్యక్షులు సుభాన్, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య మాట్లాడుతూ సర్వేలు, ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు పండగ దినాలు కూడా పనిచేయంచుకుంటున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, సుభద్ర, తభిత, సువర్ణమ్మ, రమ్య, మహేంద్ర తదితరులు ఉన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

ఆదోని రూరల్: పట్టణంలో నెలకొన్న సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.గోపాల్, సీపీఎం పార్టీ నాయకులు తిక్కప్ప, కృష్ణమూర్తి, వెంకటేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం అమరావతినగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. వీధుల్లో తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

శిశువు మరణంపై విచారణ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 9వ తేదీన శిశువు మృతి చెందడంపై విచారణ నిమిత్తం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవి బుధవారం ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. ఫిర్యాదుదారుడు మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వీజీఆర్ కొండయ్య, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ బాలజీ కుమార్, వైద్యులు, సిబ్బందిని పిలిపించి ఆమె విచారించారు. వైద్యులు తమ ప్రైవేట్ క్లినిక్స్‌పై చూపుతున్న శ్రద్ధ ప్రభుత్వాసుపత్రి విధుల్లో చూపడం లేదని లాయర్ తిమ్మప్ప, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాజీవ్ డీసీహెచ్‌ఎస్ మాధవికి ఫిర్యాదు చేశారు.

ప్రజా చైతన్య యాత్ర

పెద్దకడబూరు : మండల కేంద్రంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేష్, మండల కార్యదర్శి తిక్కన్న ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండలం పక్కనే పులికనుమ ప్రాజెక్టు ఉన్నా చాలా గ్రామాల్లో తాగడానికి మంచినీటికి ప్రజలు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో దేవదాసు, శ్రీనివాసులు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయండి

కౌతాళం: మండల పరిధిలోని చూడి నుంచి కరణి గ్రామానికి రోడ్డు వేయాలని కోరుతూ సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా చూడి గ్రామంలో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రామాంజినేయులు, వులిగయ్య బసవరాజు, ప్రకాశ్, వీరేష్, గుండప్ప పలువురు ఉన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ బాధితుడి మృతి



ఈశ్వరప్ప (ఫైల్)

ఆదోని అర్బన్: రెండు నెలల క్రితం బతికున్న వృద్ధుడు ఈశ్వరప్ప మరణించినట్లుగా ఫ్యామిలీ సర్టిఫికెట్ తయారు చేసి కొందరు ఆయన పొలం 6.70 ఎకరాల భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘటన విధితమే. సదరు బాధితుడు ఈశ్వరప్ప(70) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈశ్వరప్పను బెంగళూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుమారుడు మోహన్ తెలిపారు.

ఎస్కేడీ కాలనీలో చోరీ

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలోని జీరో రోడ్డులో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగుచూసింది. వన్‌టౌన్ ఎస్ఐ రామనాథ్ తెలిపిన వివరాలు.. ఎస్కేడీ కాలనీలోని జీరో రోడ్డులో నివాసముంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగిని రాజేశ్వరి గత నెలలో తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తికి పని నిమిత్తం వెళ్లింది. బుధవారం వచ్చి ఇంటిని తెరవగా, ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. రూ.2.50 లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయని ఫిర్యాదు చేసింది.

కర్ణాటక అంగన్‌వాడీ పాల పౌడర్ స్వాధీనం

ఆదోని అర్బన్: కర్ణాటక రాష్ట్రం అంగన్‌వాడీలకు పంపిణీ చేసే పాల పౌడర్‌ను వాహనాల్లో తరలిస్తుండగా బుధవారం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎక్కడి నుంచి ఈ పాల పౌడర్ వచ్చింది, ఎక్కడికి వెళ్తుందన్న విషయాలు తెలియాల్సి ఉంది. దీనిపై విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

'యువత పోరు'కు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆదోని టౌన్: కర్నూలులోని కలెక్టరేట్ వద్ద బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన 'యువత పోరు' కార్యక్రమానికి ఆదోని నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, విద్యార్థినీవిద్యార్థులు, యువకులు భారీగా వాహనాల్లో తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత బయలుదేరి కర్నూలు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్‌వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: యువత పోరు కార్యక్రమానికి వెళ్లే పార్టీ శ్రేణుల వాహనాలను రాష్ట్ర వీరశైవలింగాయత్ అధ్యక్షుడు రుద్రగౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. యువతను, విద్యార్థులను, అన్ని వర్గాలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

ఇంజినీరింగ్ విద్యార్థినుల ఔదార్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థినులు వంట మనిషికి ఆర్థిక సాయం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. బుధవారం ఆర్థిక సాయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా వంట మనిషి పార్వతమ్మకు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాలేజీ హాస్టల్‌లో వంట పనిచేసే పార్వతమ్మ భర్త అనారోగ్యానికి గురి కావడంతో హాస్టల్ విద్యార్థినులు మానవతాదృక్పథంతో తమకు తోచిన ఆర్థిక సాయం అందించారని చెప్పారు.

చర్యలు తీసుకోవాలి

పెద్దకడబూరు: మండలంలో బ్లాక్ మెయిల్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న విలేకరులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అత్యవసర ప్రథమ చికిత్స చేసే ఆర్ఎంపీలపై కొందరు విలేకరులు రకరకాలుగా వేధిస్తూ, ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకొని ఆర్ఎంపీలకు రక్షణ కల్పించాలని కోరారు.

ఘనంగా ఆది జగద్గురు రేణుకాచార్యుల జయంతి



జంగమవటులకు అయ్యాచార వేసిన పీఠాధిపతులు

ఆదోని అర్బన్: శ్రీ ఆదిజగద్గురు రేణుకాచార్యుల జయంతి సందర్భంగా స్థానిక శ్రీ పేటవీరభద్రేశ్వర స్వామి ఆలయంలో రేణుకాచార్యుల ఉత్సవమూర్తికి బుధవారం ఆదోని డివిజన్ జంగమ సమాజ సేవాసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం జంగమవటులకు అయ్యాచార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్తూరు మఠం పీఠాధిపతులు చిన్నవీర శివాచార్యులు, ఆదోని కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధస్వాము పాల్గొన్నారు. పీఠాధిపతులు ఆధ్యాత్మిక విషయాలను ప్రసంగించారు. సాయంత్రం రేణుకాచార్యుల పంచలోహ ఉత్సవ విగ్రహంతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

ఉరుకుందలో చలివేంద్రం ప్రారంభం



తాగునీటిని భక్తులకు అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్

కౌతాళం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద వేసవి కాలం దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు ఎండతీవ్రత పెరుగుతుండడంతో స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీటి ఎద్దడి లేకుండా చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం



పట్టుబడిన అక్రమ మద్యంను ధ్వంసం చేయిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణ రెడ్డి

కోసిగి: కోసిగి, కౌతాళం మండలాలలోని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక, ఆంధ్ర మద్యం బాటిళ్లను జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదేశాల మేరకు ధ్వంసం చేశారు. బుధవారం కోసిగి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణ రెడ్డి సమక్షంలో కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, సివిల్ ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పట్టుబడిన మద్యం బాటిళ్లను ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వారు మాట్లాడుతూ కోసిగి సివిల్, ఎక్సైజ్, కౌతాళం సివిల్ సేషన్‌ల పరిధిలో గత ఏడాది ఆగస్టు నెల నుంచి డిసెంబర్ వరకు 105 కేసులలో 2,442 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.12,76,600 ఉంటుందన్నారు. ఇందులో కోసిగి ఎక్సైజ్ సీఐ కార్తీక్ సాగర్, కోసిగి, కౌతాళం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న టూ టౌన్ సీఐ సూర్యమోహన్ రావు

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అప్పుడే మనం అనుకున్నది సాధించగలమని టూ టౌన్ సీఐ సూర్యమోహన్ రావు అన్నారు. సెయింట్ అంథోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల విడ్కోలు సమావేశం కరస్పాండెంట్ జాన్ డెవిడ్ అధ్యక్షతన బుధవారం జరిగింది. పాఠశాల హెచ్ఎం కేశవయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థి జీవితంలోఎదగడానికి ప్రధానమైన మెట్టు పదవ తరగత అని తెలిపారు. కష్టంతో కాకుండా ఇష్టంతోనే మనం చదవాలన్నారు. అప్పుడే మనం పరీక్షలో విజయం సాధించగలమని తెలిపారు. కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ రాంనాథ్, ఉపాధ్యాయులు నిర్మలమేరి, ప్రకాశమ్మ, శాంతి, మారెమ్మ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రికార్డులు కలిగి ఉండాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

ఆదోని అర్బన్: ప్రతి వాహనదారుడు వాహనాలకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు తెలిపారు. బుధవారం ఆదోని పట్టణంలోని పోలీసు కంట్రోల్ రూమ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సులు, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వాహనదారులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: క్యాన్సర్ లాంటి వ్యాధులపై ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలను జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. బుధవారం పట్టణంలోని ఖిల్లా కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాయలంలో వైద్యులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలకు ఎన్‌సీడీ, సీడీ వ్యాధుల స్క్రీనింగ్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులైన రొమ్ము క్యాన్సర్, నోటి, గర్భాశయముఖ ద్వార క్యాన్సర్‌లపై రోజుకు 40 గృహలను సందర్శించి అనుమానితులను గుర్తించాలని సూచించారు. అలాగే సామాజిక ఆరోగ్య శాఖ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు క్యాన్సర్ వ్యాధి దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో స్థానిక వైద్యులు నిస్సిగ్రేస్. సాయి జాహ్నవి, శ్రీనివాసబాబు, వీణ, ఎంపీహెచ్ఈఓ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్ రంజన్‌మిశ్రా కమిషన్ నివేదికను ఆమోదించొద్దు

ఆదోని రూరల్: మాలలకు అన్యాయం చేసే రాజీవ్ రంజన్‌మిశ్రా ఏకసభ్య కమిషన్ వర్గీకరణ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించరాదని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయి రామ్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెజార్టీ జనాభా 20 శాతం పైగా కలిగిన మాలలకు కేవలం 7.5 రిజర్వేషన్ కేటాయించి విద్య, ఉద్యోగ రంగాల్లో అడ్డుకోవడానికి ఈ నివేదిక యత్నిస్తోందన్నారు. నాలుగు శాతం లేని మాదిగలకు ఈ నివేదికలో 6.5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పెద్దపీట వేశా రని ఆరోపించారు. బసాపురం ఎల్లప్ప, నీలకంఠ ఉన్నారు.

రైళ్లను పునరుద్ధరించాలి

ఆదోని రూరల్: రాయచూరు నుంచి కాకినాడ వరకు నడుస్తున్న రైలును కరోనా సమయంలో అర్ధంతరంగా నిలిపివేశారని, వెంటనే ఆ రైలును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు, ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అమరావతి రాజధాని కాబట్టి ఆ రైలును ఉన్నతాధికారులు పునఃరుద్ధరిస్తే ప్రజలకు వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అలాగే గతంలో ప్రతిరోజూ బెలగావి నుంచి మణుగూరుకు వెళ్లేందుకు నడుస్తున్న రైలును రద్దు చేయడంతో ఈ ప్రాంతం నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన విద్యార్థులు, ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ రైలును కూడా పునఃరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వై.టి.భీమేష్, జిల్లా సమితి సభ్యులు ఉసేని, షేక్షావలి, కొత్తూరు గంగన్న, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేసిన డిప్యూటీ ఈఓ వెంకట రమణారెడ్డి, దాత విశ్వనాథ్

నందవరం : విద్యార్థులకు విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు లభిస్తుందని డిప్యూటీ ఈఓ వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు దాత విశ్వనాథ్ నేతృత్వంలో డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ-2 రఘునాథ్ చేతుల మీదుగా ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ క్రాంతికుమార్, సీఆర్‌పీ ఉరుకుంద, ట్యూటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

కోసిగి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోసిగి బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్ విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సరస్వతి పూజా కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా గ్రామదేవతల దేవర



కుప్పగల్‌లో పూజలందుకున్న పెద్దమ్మవ్వ,కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, భక్తులు

ఆదోని రూరల్: మండలంలోని కుప్పగల్, బల్లేకల్ గ్రామాల్లో మంగళవారం, బుధవారం దేవర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. కుప్పగల్ గ్రామంలో పెద్దమ్మవ్వ, బంగారమ్మవ్వ రథోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి అమ్మవార్లకు జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ బుధవారం కుంభాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అలాగే బల్లేకల్ గ్రామంలో బంగారమ్మవ్వ దేవర కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దతుంబళం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా సుంకులమ్మ దేవి దేవర



జంపాపురంలో పూర్ణకుంభాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో సుంకులమ్మ దేవి దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువ జామున నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రతి ఇంటా నైవేద్యం తయారు చేసి పూర్ణకుంభాలలో మేళతాళాలు డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం చెంతకు చేరుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామంలో మూడేళ్ల తర్వాత దేవర ఉత్సవాలను భక్తులు అత్యధికంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు.

చెత్తరహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం

కౌతాళం:కౌతాళాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దుదామని సర్పంచ్ పాల్ దినకర్ అన్నారు. బుధవారం ఈఓపీఆర్‌డీ యోగేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి శివప్ప ఆధ్వర్యంలో గ్రామంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, కృష్ణావధూత ఆశ్రమం, తహసీల్దారు కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇంట్లో చెత్తను పంచాయతీ సిబ్బందికి అందజేయాలని కోరారు.